తిరుమల శ్రీవారి సేవలో సీఎం కేసీఆర్ సతీమణి

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సతీమణి శోభ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల చేరుకున్న ఆమె.. మంగళవారం తెల్లవారుజామున స్వామివారి దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం అలయ అర్చకులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. టీటీడీ అధికారులు స్వామివారి చిత్ర పటాన్ని బహూకరించారు. అంతకుముందు టీటీడీ అధికారులు, వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు వారికి ఆహ్వానం పలికారు. శ్రీవారి దర్శనానంతరం తిరుగుప్రయాణంలో శ్రీకాళహస్తి ముక్కంటిని దర్శించుకున్నారు. దక్షిణ కైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనానికి విచ్చేసిన సీఎం కుటుంబ సభ్యులకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. అనంతరం దక్షిణామూర్తిని దర్శించుకున్నారు. ఆలయ పూజరులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

బస్సెక్కితే 11 లక్షల బహుమతులు

- 110 మందికి రూ.9,900 చొప్పున
- విజయదశమి సందర్భంగా లక్కీ డ్రా
- ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తేతెలంగాణ): దసరా పర్వదినం సందర్భంగా మీరు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించనున్నారా? కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సొంతూళ్లకు వెళ్లనున్నారా? అయితే మీరు నగదు బహుమతులు గెలుపొందే అవకాశాన్ని టీఎస్‌ఆర్టీసీ కల్పిస్తున్నది. అందుకు మీరు చేయాల్సిందల్లా ఒక్కటే.. ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనుకాల మీ పూర్తి పేరు, ఫోన్ నంబర్‌ను రాసి డ్రాప్ బాక్సుల్లో వేయడమే. రాఖీ పౌర్ణమి మాదిరిగానే విజయదశమి పర్వదినాన కూడా ప్రయాణికులకు లక్కీడ్రా నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ లక్కీడ్రాలో గెలుపొందిన ప్రయాణికులకు మొత్తంగా రూ.11 లక్షల విలువైన నగదు బహుమతులను అందించనున్నది. 11 రీజియన్లలో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళల చొప్పున 110 మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికీ రూ.9,900 చొప్పున నగదు బహుమతులను ఇవ్వనున్నది. ఈ నెల 21 నుంచి 23 వరకు, మళ్లీ 28 నుంచి 30 వరకు టీఎస్‌ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో ప్రయాణించే వారందరూ ఈ లక్కీ డ్రాలో పాల్గొనవచ్చు. ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న వారూ అర్హులేనని అధికారులు తెలిపారు. ఆయా రోజుల్లో ప్రయాణించిన వారు తమ టికెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి డ్రాప్ బాక్సుల్లో వేయాలి. బస్టాండ్లు, ప్రయాణికుల రద్దీ ప్రాంతాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా డ్రాప్‌బాక్స్‌లను సంస్థ ఏర్పాటు చేయనున్నది. ప్రతి రీజియన్ పరిధిలో అధికారులు లక్కీడ్రా నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందజేస్తారు. సెప్టెంబర్ 31న రాఖీ పండుగ సందర్భంగా టీఎస్‌ఆర్టీసీ లక్కీ డ్రా నిర్వహించి 33 మంది మహిళా ప్రయాణికులకు రూ.5.50 లక్షల నగదు పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించింది.

5,265 ప్రత్యేక బస్సులు: ఎండీ సజ్జనార్

బతుకమ్మ, దసరా పండుగలకు సొంతూళ్లకు వెళ్లే వారి కోసం టీఎస్‌ఆర్టీసీ 5,265 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేయనున్నట్టు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ నెల 13 నుంచి 24 వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని సర్వీసులను నడపాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. రాఖీపౌర్ణమిలాగే దసరా పర్వదినం సందర్భంగా ప్రయాణికులకు లక్కీడ్రా నిర్వహించి నగదు బహుమతులను అందజేయనున్నట్టు పేర్కొన్నారు. దసరాతో పాటు దీపావళి, సంక్రాంతి తదితర పర్వదినాలకు లక్కీడ్రా నిర్వహిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు ఆర్టీసీ కాల్‌సెంటర్ నంబర్లలో 040-69440000, 040-23450033 సంప్రదించాలని పేర్కొన్నారు.

సంజయ్.. ఇది ఏ సనాతన ధర్మం?

- సీఎం అనారోగ్యానికి గురైతే వెటకారమా?: దాసోజు శ్రవణ్

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కేసీఆర్ చిన్నపాటి అనారోగ్యానికి గురైతే బీజేపీ ఎంపీ బండి సంజయ్ చిల్లర వెటకారాలు చేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మానసిక దౌర్బల్యంతోనే సంజయ్ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని, తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఏ సనాతన ధర్మం ఇటువంటి చిల్లర రాజకీయాలు చేయాలని చెప్పిందని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్వీట్ (ఎక్స్) చేశారు.

ప్రజలు సంబురపడితే కాంగ్రెస్‌కు కన్నీళ్లు

- హస్తం పార్టీ ఢిల్లీలో ఎక్కువ.. గల్లీలో తక్కువ
- అంతర్గత కుమ్ములాటలు తప్ప అభివృద్ధి తెలియని పార్టీ అది
- మూడోసారీ బీఆర్ఎస్ విజయం
- హుస్నాబాద్‌లో లక్ష మందితో మొదటి ప్రజాఆశీర్వాద సభ
- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు
- హుస్నాబాద్‌లో సీఎం కేసీఆర్ బహిరంగ సభాస్థలాల పరిశీలన

హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ వినోద్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్, అక్టోబర్ 10: ప్రజలు సంబరపడితే కాంగ్రెస్, బీజేపీ కన్నీళ్లు పెట్టుకుంటాయని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రజలు సంతోషంగా ఉండడం ఆ రెండు పార్టీలకు నచ్చదని విమర్శించారు.15న సీఎం కేసీఆర్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారంప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి సభ ఏర్పాట్లను మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. సభాస్థలాన్ని పరిశీలించిన అనంతరం హుస్నాబాద్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. మూటలు తెచ్చి.. ముఠాలు ఏర్పాటు చేసి.. మతాల పేరుతో మంటలు సృష్టించైనా సరే అధికారంలోకి రావాలని ఆ పార్టీ చూస్తున్నదని ఆరోపించారు. ఆ పార్టీ పరిస్థితి ఢిల్లీలో ఎక్కువ.. గల్లీలో తక్కువ అన్న చందంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. ఇలాంటి పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని హెచ్చరించారు. అదో ఎండ్రకాయ పార్టీ అని, ఒకరు పైకి వెళ్తుంటే మరొకరు కిందికి గుంజుతుంటారని విమర్శించారు. అంతర్గత కుమ్ములాటలతో బిజీగా ఉండే కాంగ్రెస్ నాయకులు ప్రజా సంక్షేమాన్ని ఏం పట్టించుకుంటారని ప్రశ్నించారు.

ఒక్క హామీ అయినా నెరవేర్చిందా?

ఫేక్ సర్వేలు, గూగుల్ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. కర్ణాటక నుంచి డబ్బు మూటలు తీసుకొచ్చి, ముఠాలు ఏర్పాటు చేసి ప్రజలను ఆందోళనకు గురిచేస్తూ ఎన్నికల్లో గెలవాలన్న కుట్రలు సాగుతున్నాయని, మతం పేరుతో మంటలు సృష్టించి అయినా సరే అధికారంలోకి రావడానికి ఆ పార్టీ వెనుకాడదని పేర్కొన్నారు. 2019 ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేనని విమర్శించారు. కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో భాగంగా తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసి వందలాది మంది తెలంగాణ ప్రజల చావుకు కారణమైందని ఆరోపించారు. మూడు గంటల కరెంట్ చాలన్న కాంగ్రెస్ పార్టీ కావాలో.. మోటార్లకు మీటర్లు పెడుతున్న బీజేపీ కావాలో.. 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న కేసీఆర్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. తొమ్మిదిన్నరేండ్లలో సుస్థిర పాలన అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే చెందుతుందని, ఆయన నాయకత్వంలో దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా మారిందని వివరించారు. ఇక్కడి పథకాలను దేశమంతటా అమలు చేస్తున్నారంటేనే సీఎం కేసీఆర్ విజన్ ఏమిటో తెలుస్తున్నదని పేర్కొన్నారు.

కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కర్ర శ్రీహరి, దేవేందర్‌రావు, ఏడు మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే వాటిపని

8 టీఎంసీలతో గౌరవెల్లిని పూర్తిచేసి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేసేందుకు సన్నాహాలు చేస్తుంటే కాంగ్రెస్, బీజేపీ అడ్డుతగులుతూ కేసులు వేస్తూ ముందుకు పోకుండా చేస్తున్నారని ఆరోపించారు. నీళ్లొస్తున్నాయని ప్రజలు సంబురపడితే కాంగ్రెస్, బీజేపీ నాయకులకు కన్నీళ్లొస్తున్నాయని విమర్శించారు. ఎవరు అవునన్నా, కాదన్నా మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం, కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 15న హుస్నాబాద్‌లో జరగబోయే ప్రజాఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రకటించబోయే మ్యానిఫెస్టోతో ప్రతిపక్ష పార్టీ నాయకుల మైండ్ బ్లాంక్ కావడం ఖాయమని పేర్కొన్నారు.

మా ఫొటోలతో నీ కుల రాజకీయమేంది?

- స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు కులాన్ని వాడుకుంటున్న ఈటల
- అణచివేత చర్యలను బయటపెడ్తం
- కేసీఆర్ పెట్టిన రాజకీయ భిక్షతో ఎదిగి ఇప్పుడు స్థాయి మరిచి వ్యాఖ్యలు
- రాజేందర్‌పై మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్, 'మత్స్య' సంస్థ చైర్మన్ ఫైర్

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్. చిత్రంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, కార్పొరేషన్ చైర్మన్లు గెల్లు, పిట్టల, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ నేత ఈటల రాజేందర్ కులాన్ని వాడుకుంటున్నారని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మత్స్య సహకార సంస్థ చైర్మన్ పిట్టల రవీందర్ విమర్శించారు. 'మా ఫొటోలతో నీ కుల రాజకీయమేంటి?' అని నిలదీశారు. ముదిరాజ్ మహాసభ అనుమతి లేకుండా, వ్యక్తిగతంగా తమ అనుమతి లేకుండా ఈటల నిర్వహించిన సభలో తమ ఫొటోలు ఎలా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈటల అణచివేత రాజకీయాలను త్వరలో బయటపెడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పెట్టిన రాజకీయ భిక్షతో ఎదిగిన ఈటల తన పూర్వస్థితి మరచిపోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్సీ ఎల్ రమణ, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ముదిరాజ్ సభలో ఈటల చేసిన వ్యాఖ్యలను బండా ప్రకాశ్ ఖండించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని సమున్నతంగా నిలిపింది సీఎం కేసీఆర్ మాత్రమేనని స్పష్టంచేశారు. ఆత్మగౌరవ భవనాల నిర్మాణమే కాకుండా కులవృత్తిని రక్షించి, ప్రోత్సహించిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని చెప్పారు. రాజకీయంగా ముదిరాజ్‌లను ఎదగకుండా చేసిందే ఈటల అని మండిపడ్డారు.

బీసీలపై ప్రేమ ఉంటే మోదీతో కొట్లాడు..

ఈటలకు బీసీలపై నిజమైన ప్రేమ ఉంటే బీసీ కులగణన, బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడాలని బండ ప్రకాశ్ డిమాండ్ చేశారు. ముదిరాజ్ మహాసభ రోహిణి కమిషన్‌కు ఇచ్చిన సిఫారసులు అమలు కోసం మోదీతో కొట్లాడాలని హితవు పలికారు. ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని అవమాన పరిచే విధంగా ఈటల వ్యవహరించిన నేపథ్యంలో సీఎం కేసీఆర్ తనకు రాజ్యసభ సభ్యుడిగా, ఎమ్మెల్సీగా, శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ముదిరాజ్ మహనీయులను గుర్తించి వారి జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే జరిపించేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ అన్ని రకాల అవకాశాలు కల్పిస్తున్నదని, పార్టీ పదవులు, వివిధ కార్పొరేషన్ పదవులు పొందిన వారి పేర్లను ఈ సందర్భంగా ఉదహరించారు.

అజ్ఞాని ఈటల : రవీందర్

మత్స్య రంగంపై తన అజ్ఞానాన్ని ఈటల బయటపెట్టుకున్నారని మత్స్య కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ విమర్శించారు. సీఎం కేసీఆర్ చెరువులను బాగుచేసి, రిజర్వాయర్లను నిర్మించి, చెక్‌డ్యాములను బలోపేతం రాష్ట్రంలో సముద్రాలను తలపించేరీతిలో చేయటం వల్ల మత్స్య సంపద పెరిగిందని చెప్పారు. తెలంగాణ రాక ముందు రాష్ట్రంలో 1,97,000 మంది సహకార సంస్థల్లో సభ్యులుగా ఉంటే, ఇప్పుడా సంఖ్య 4 లక్షలకు పైచిలుకు చేరిందని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో 2016 నుంచి రాష్ట్రంలో సృష్టించిన మత్స్య సంపద విలువ రూ.33 వేల కోట్లని వివరించారు. తాను తప్ప మరెవ్వరూ కులంలో ఎదగకూడదని కుట్రలు చేసి నాయకత్వాన్ని అణచివేసిన ఈటల అసలు బండారాన్ని బయపెడతామని తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీలవి చౌకబారు రాజకీయాలు : ఎల్ రమణ

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌కు ఉన్న ప్రజాదరణను ఎదుర్కొలేక కాంగ్రెస్, బీజేపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్సీ ఎల్ రమణ విమర్శించారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను దమ్ముంటే ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశా రు. రాష్ట్రంలోని అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం నిత్యం పాటుపడుతున్న బీఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారంలో వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ త్వరలో వెలువరించే బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో కాంగ్రెస్, బీజేపీలు పోటీలో ఉండకుండా పోతాయని తెలిపారు.

సీఎం కేసీఆర్ ఎన్నికల టూర్ షెడ్యూల్

తేదీ	నియోజకవర్గం	సమయం
15-10-2023	హుస్నాబాద్	సాయంత్రం 5 గంటలకు
16-10-2023	జనగామ	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	భువనగిరి	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
17-10-2023	సిరిసిల్ల	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	సిద్దిపేట	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
18-10-2023	జడ్చర్ల	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	మేడ్చల్	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
26-10-2023	అచ్చంపేట	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	నాగర్‌కర్నూల్	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
	మునుగోడు	మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు
27-10-2023	పాలేరు	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	స్టేషన్ ఘన్‌పూర్	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
29-10-2023	కోదాడ	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	తుంగతుర్తి	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
	ఆలేరు	మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు
30-10-2023	జుక్కల్	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	బాన్సువాడ	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
	నారాయణ్‌ఖేడ్	మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు
31-10-2023	హుజూర్‌నగర్	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	మిర్యాలగూడ	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
	దేవరకొండ	మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు
01-11-2023	సత్తుపల్లి	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	ఇల్లందు	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
02-11-2023	నిర్మల్	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	బాల్కొండ	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
	ధర్మపురి	మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు
03-11-2023	ముథోల్ (భైంసా)	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	అర్మూర్	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
	కోరుట్ల	మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు
05-11-2023	కొత్తగూడెం	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	ఖమ్మం	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
06-11-2023	గద్వాల	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	మక్తల్	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
	నారాయణపేట	మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు
07-11-2023	చెన్నూర్	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	మంథని	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
	పెద్దపల్లి	మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు
08-10-2023	సిర్పూర్	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	ఆసిఫాబాద్	మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు
	బెల్లంపల్లి	మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు
09-11-2023	గజ్వేల్	మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు
	కామారెడ్డి	సాయంత్రం 4 గంటలకు

బీజేపీవి దొంగ హామీలు.. జుమ్లా మాటలు

- ఆదిలాబాద్‌లో షా అసత్య ప్రచారం
- మంత్రి సత్యవతి రాథోడ్ మండిపాటు

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): బీజేపీవి దొంగ హామీలు.. మోసపూరిత వాగ్దానాలని, వాటిని గిరిజన బిడ్డలు నమ్మరని మంత్రి సత్యవతి రాథోడ్ స్పష్టం చేశారు. కేంద్రమంతి అమిత్‌షా ఆదిలాబాద్‌లో చేసిన వ్యాఖ్యలపై మంగళవారం మండిపడ్డారు. గిరిజన వర్సిటీకి ప్రభుత్వం స్థలం చూపించలేదనడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. సీఎం కేసీఆర్ 2014 నుంచి వర్సిటీ ఏర్పాటు చేయాలని అనేకసార్లు ప్రధానిని కలిసి డిమాండ్ చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ములుగు జిల్లా జాకారంలో ప్రభుత్వం 335 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని, అయినా 2016 నుంచి కుంటిసాకులు చెప్తూ కాలయాపన చేసింది కేంద్రం కాదా? అని నిలదీశారు. తీరా ఇప్పుడు ఎన్నికల సమయంలో వర్సిటీ ప్రకటించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్మార్ట్‌ఫోన్‌తోనే నోటి క్యాన్సర్ గుర్తింపు

- ప్రత్యేక యాప్‌ను రూపొందించిన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు
- ప్రయోగ దశలో సత్ఫలితాలు.. త్వరలో క్షేత్రస్థాయి పరిశీలన

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించడం ఆరోగ్య సరంక్షణ వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు. దీన్ని అధిగమించడంలో ఆధునిక సాంకేతికతలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి స్మార్ట్‌ఫోన్‌తోనే ఓరల్ క్యాన్సర్ (నోటి క్యాన్సర్)ను గుర్తించవచ్చని తేలింది. దీనిపై ఐహబ్ డాటా, ఐఎన్ఏఐతో కలిసి నిర్వహించిన ప్రాథమిక అధ్యయనంలో మంచి ఫలితాలు వచ్చినట్టు గచ్చిబౌలిలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ) అధికారులు తెలిపారు. ఏఐ సాయంతో పలు సమస్యలకు పరిష్కారాలను కనుగొనేందుకు ప్రముఖ చిప్ కంపెనీ ఇంటెల్ ఐఎన్ఏఐ పేరుతో ట్రిపుల్ ఐటీలో ఓ రిసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు నోటిలోని గాయాలను గుర్తించేందుకు కృత్రిమ మేధస్సుతోపాటు మెషీన్ ల్యాంగ్వేజ్‌లను ఉపయోగించి ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించారని, దీని సాయంతో ఓరల్ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చని ఐఎన్ఏఐ సీఈవో కోనాల వర్మ వివరించారు. ప్రయోగ దశలో విజయవంతమైన ఈ విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్టు తెలిపారు.

నిజామియాలో వసతులకు చేపట్టిన చర్యలేమిటి?:హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌ని నిజామియా దవాఖానలో మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన చర్యలను వివరించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. శిథిలావస్థలో ఉన్న ఈ దవాఖాన భవనం గురించి పత్రికల్లో వచ్చిన వార్తను హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం సుమోటో వ్యాజ్యంగా పరిగణించి మంగళవారం విచారణ జరిపింది. భవనంలోని బాలికల వసతి గృహాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలను వివరించాలని సీఎస్, వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, వైద్యవిద్య డైరెక్టర్, దవాఖాన సూపరింటెండెంట్‌కు నోటీసులు జారీచేసి, విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.

రేవంత్‌కు కేసుల వివరాలు ఇవ్వండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను అందజేయాలని రాష్ట్ర హోంశాఖను, డీజీపీని హైకోర్టు ఆదేశించింది. తనపై నమోదైన కేసుల వివరాలు అందజేయలని డీజీపీని కోరుతూ ఈ నెల 3న లేఖ రాసినా ఇప్పటివరకు ఇవ్వలేదని రేవంత్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాసర్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడినందున అభ్యర్థులంతా నామినేషన్లతోపాటు వారిపై నమోదైన కేసుల వివరాలను అందజేయాల్సి ఉన్నదని గుర్తుచేశారు. దీంతో పిటిషనర్ కోరిన వివరాలను త్వరలో అందజేసేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నట్టు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అనంతరం ఈ అంశంపై విచారణను ఈ నెల 17కు వాయిదా వేస్తున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు.

మూడోసారీ హుస్నాబాద్ నుంచే!

- ఈ నెల 15న కేసీఆర్ సమరశంఖం
- 2014, 2018 ఎన్నికల ప్రచారాన్ని అక్కడి నుంచే ప్రారంభించిన కేసీఆర్
- ఈసారి 100 సీట్లపైబీఆర్ఎస్ గురి

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): రెండుసార్లు కలిసొచ్చిన హుస్నాబాద్ నుంచే ఈసారి కూడా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సమరశంఖం పూరించనున్నారు. తెలంగాణ అసెంబ్లీకి తొలిసారిగా 2014లో జరిగిన ఎన్నికల ప్రచారాన్ని కేసీఆర్ హుస్నాబాద్ నుంచే ప్రారంభించారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ 63 స్థానాల్లో విజయం సాధించడంతో కేసీఆర్ ముఖ్యమంత్రిగా పాలనాపగ్గాలు స్వీకరించారు. ఆ తరువాత 2018 సెప్టెంబర్ 6న అసెంబ్లీని రద్దు చేసిన మరుసటి రోజే (సెప్టెంబర్ 7) హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల శంఖారావం పూరించారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ 88 స్థానాలతో జైత్రయాత్ర కొనసాగించి, వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చింది. వందకుపైగా సీట్లతో హ్యాట్రిక్ విజయంపై గురిపెట్టిన సీఎం కేసీఆర్ ఈసారి కూడా హుస్నాబాద్ నుంచే సమరశంఖం పూరిస్తుండటం విశేషం. ఈ నెల 15న మధ్యాహ్న 3 గంటలకు హుస్నాబాద్ నుంచే సమరశంఖం పూరించనున్న నేపథ్యంలో మరోసారి ఈ నియోజకవర్గం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నది.

మా అదృష్టం: ఎమ్మెల్యే వొడితెల

బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మూడో